# పండగ

గోపాల్రావ్ అదిరిపడి నిద్రలేచి కూర్చున్నాడు. సరిగ్గా సమయానికి అతని భార్య రాజ్యలక్ష్మి, అయిదేళ్ళ బాబిగాడు ఆరునెలల పసిగుడ్డూ కూడా ఉలిక్కిపడి లేచారు. బాబిగాడు కెవ్వుమనే ఏడుపూ, ఆరునెలల పసిగుడ్డు గుక్క పట్టి ఇల్లెగిరేలా ఆలాపించడం – ఇవన్నీ కూడా ఆ మరుక్షణంలోనే ప్రారంభమయిపోయాయ్!

అసలు జరిగిందేమిటో గోపాల్రారావ్‌కి ఓ పట్టాన అర్థం కాలేదు. ఏదో కొంపలు మునిగిపోతున్న శబ్దాలు. గుండెల మీద కొడుతున్నట్లు సమ్మెట దెబ్బ శబ్దాలు.

"ఏమిటది? మన పక్క మేడల గోడలు – ఏమయినా కూలిపోతున్నాయా?" ఖంగారుగా అడిగాడు గోపాల్రావ్.

"ఆ – మీరు మరీనూ – మన కిటికీ పక్కన రోడ్డుమీద వినాయకుడి ఉత్సవం చేయటం లేదూ? వాళ్ళు మైకులో సినిమా రికార్డ్సు పెట్టినట్టున్నారు. ఇవాళేగా వినాయక చవితి!' అంది రాజ్యలక్ష్మి.

మరి కొద్ది క్షణాలు ఆ శబ్దాలు విన్నాక ఆమె చెప్పినమాట నిజమేనని అర్థమయి పోయింది మా అందరికీ.

ఆ స్పీకర్ మరీ కిటికీ పక్కనే ఉండడంతో ఆ శబ్దాలు సినిమా రికార్డులోని ఆర్కెస్ట్రావని తెలీలేదు. ఈలోగా ఆర్కెస్ట్రా ఆగి పాట మొదలయిపోయింది.

– ఓ సుబ్బారావూ, ఓ అప్పారావూ – ఓ వెంకట్రావూ–

చెవులు పగిలిపోతున్నాయ్.

"ఇదేమిటిలా అర్థరాత్రి మైకు?"

రాజ్య లక్ష్మి నగిగాడతను.

"అర్థరాత్రేమిటి? తెల్లవారు జాము మూడయిపోయిందిగా? అందుకని పెట్టి ఉంటారు!" అందామె తేలికగా.

గోపాల్రావ్ బాబిగాడిని యెత్తుకుని గదిలో అలూ ఇటూ పచార్లు చేస్తూ నిద్ర పుచ్చడానికి ప్రయత్నించసాగాడు.

రాజ్యలక్ష్మి ఆరునెలల పసిగుడ్డు చెవిలో దూది పెట్టి. ఆ మైక్ పాట వినబడకుండా చెవులకు గుడ్డ చుట్టేసింది.

గోపాల్రావ్‌కి ఆ పేట విఘ్నేశ్వర ఉత్సవ కమిటి మీద పళ్లుమండిపోయింది.

"ఇప్పుడే వెళ్ళి ఆ స్పీకర్ డైరక్షన్ మార్చమని చెప్పివస్తాను...." అన్నాడు రాజ్యలక్ష్మితో.

"వాళ్ళు మీ మాట వింటారా ఏమిటి, మీ పిచ్చిగాని...." మళ్ళీ మంచం మీద పడుకుని తలగడ చెవి మీద వేసుకుంటూ అందామె.

గోపాల్రావ్ బాబిగాడితో సహా రోడ్డు మీద కొచ్చాడు. నలుగురు యువకులు గ్రామఫోన్ దగ్గర కూర్చుని బూతులు మాట్లాడుకుంటున్నారు.

"ఈ పాట పాడేప్పుడు జయమాలిన్ని సూడాలిరా – నీ యవ్వ – మొత్తం...

"ఈ రికార్డప్పుడా?"

"ఆవ్–"

"ఇస్కే మాకీ – గప్పుడే నేను సిగిరెట్ తాగనికి బయటి కెళ్ళినా–"

"కల్‌ఫిర్ జాయంగే – చల్తే? ఇస్కే మాకీ – ఛోడ్‌నానై – ఉత్‌నా జబర్దస్త్ బతాతీ రే –"

పాట అయిపోయింది.

మరో రికార్డ్ తీశాడు మైక్ కుర్రాడు.

"ఏం పాటది!"

"ఇదిగో తెల్లచీరా – ఇవిగో – మల్లెపూలు–"

"ఊ ఊ ఊయ్ – యెయ్ నీ యవ్వా – "

పాట మొదలయి పోయింది.

గోపాల్రావ్ వాళ్ళ దగ్గరకు నడిచాడు రోడ్డు కడ్డంగా పెద్ద స్టేజి! దాని మీద వినాయకుడు – చాలా పెద్ద బొమ్మ–

"ఇదిగో కొంచెం ఆ స్పీకర్ అటు నుంచి ఇటు పక్కకు తిప్పి పెడతారా"

వాళ్ళందరూ అతనివంక పిచ్చివాడిని చూసినట్టు చూశారు.

"ఎందుకు?"

"అది సరిగ్గా మా ఇంటి కిటికీ కెదురుగ్గా ఉంది. ఇంట్లో చెవులు పగిలిపోతున్నాయ్"

ఇద్దరు వెకిలిగా నవ్వారు.

"కిటికీ తలుపులు మూసుకోండ్రి!"

"మూసుకున్నా లాభంలేదు"

"స్పీకర్ తిప్పనీకి కాదు–"

"అంటే ఇవాళంతా ఆ వెధవపాటల మోత భరించాల్సిందేవన్నమాట !" కోపం అణచుకుంటూ అన్నాడు.

"ఇయాలా! ఇయాలేమిటి! తొమ్మిద్దినాలుంటదిది–"

"అంటే ఈ స్పీకర్ మరో వేపుకి తిప్పరన్నమాట–"

"ఛల్ ఛల్‌మియా! – నీకోసం స్పీకర్ తిప్పనికి నువ్వేం మినిష్టరువా – ఎళ్ళెళ్ళు"

గోపాల్రావ్ కోపం అణచుకుని అక్కడి నుంచి వచ్చేశాడు.

"ఏమన్నారు?" అంది రాజ్యలక్ష్మి.

"రేపొద్దున్న పోలీస్‌కి కంప్లెయింట్ ఇస్తాను."

అరగంట గడచిపోయింది. తనూ రెండు చెవుల్లో దూది పెట్టుకుని పడుకున్నాడు గోపాల్రావు. వంటింటివేపు నుంచీ హఠాత్తుగా చెవులు పగిలేలా శబ్దమయింది. మళ్ళీ బాబిగాడూ, చంటిదీ లేచి కెవ్వుమని ఏడుపు మొదలెట్టారు.

గోపాల్రావ్, రాజ్యలక్ష్మి తృళ్లిపడి లేచికూర్చున్నారు.

'హే కృష్ణా, ముకుందా, మురారీ–'

"ఇటు పక్కవీధిలో ఇంకో వినాయకుడినీ పెట్టినట్లున్నారండీ..." అంది రాజ్యలక్ష్మి.

రెండు మైకుల పాటలూ కలబడి పోయినాయ్.

హే కృష్ణా – ఇదిగో తెల్ల చీరా – ముకుందా ఇవిగో మల్లెపూలు – మురారీ. ఇదిగో తెల్ల చీరా – జయకృష్ణా – ఇదిగో మల్లె – ముకుందా పూలు – మురారీ–

"అబ్బా!" రెండు చేతుల్తో తల పట్టుక్కూర్చున్నాడు గోపాల్రావ్.

రెండు రికార్డులూ ఒకేసారి అయిపోయే సరికి మొఖం పగిలిపోయేటంత నిశ్శబ్దం–

హఠాత్తుగా అంత నిశ్శబ్దం భరించలేక బాబిగాడూ, చంటిదీ భయపడిపోయి మళ్ళీ ఏడుపు ప్రారంభించారు.

లేచి బయటికొచ్చాడు గోపాల్రావ్.

పక్క వాటాలోని పెద్ద మనిషి కిటికీ దగ్గర టేబుల్ ముందు కూర్చుని ఏవో ఫైయిళ్ళలో రాసుకుంటున్నాడు.

గోపాల్రావ్ అతని కిటికీ దగ్గరకు నడిచాడు.

అతను గోపాల్రావ్‌ని చూచి "హలో" అన్నాడు చిరునవ్వుతో.

గోపాల్రావ్ లోపలికెళ్ళి అతని పక్కనే ఉన్న స్టూల్ మీద కూర్చున్నాడు.

"ఏమిటి పొద్దున్నే లేచారివాళ!" అడిగాడతను.

"నేను లేవలేదు – ఆ వెధవ మైకులు లేపేశాయ్" – కోపంగా అన్నాడు గోపాల్రావ్.

"ఓ అదా సంగతి!"

"ఆ పాడు మోత మీకు పిచ్చెక్కించడం లేదూ!"

అతను నవ్వాడు.

నాకీ మధ్య కొంచెంగా చెవుడొచ్చింది. చెవి దగ్గర మాట్లాడే వాళ్ళ మాటలే తప్ప ఇంకో శబ్దం వినిపించదు"

"అంటే మైకులు అంత మోతెక్కుతున్నా...."

"ఎక్కడో కిలోమీటరు దూరంలో మోగుతున్నట్లుంది."

ఇంక అతనితో మాట్లాడడం అనవసరం అనిపించి అక్కడి నుంచి బయటికొచ్చాడు. గోపాల్రావ్.

అవతలి వేపు వాటాలో నుంచి శ్రీనవాసరావ్ బయటి కొచ్చాడు పళ్ళు తోముకుంటూ.

"చూశారా ఆ మోత!" అడిగాడు గోపాల్రావ్–

"మూడింటి నుంచీ చూస్తూనే ఉన్నాను ఏం చేస్తాం?"

"అందరం కలిసి వెళ్ళి ఆ గొడవ ఆపించ లేమూ!"

"మనమా!"

"అవును – ఏం!"

"ఆ ఉత్సవం చేసే దెవరనుకుంటున్నారు! ఈ ఏరియాలోని గుండాలు – వాళ్ళు మనమాట వింటారా!"

"అయితే ఇలా ఈ తొమ్మిది రోజులూ ఈవరకం అనుభవిస్తూనే ఉండాలా!"

"నేనందుకే ఓ ప్లాన్ వేశాను–"

"ఏమిటది! చెవుల్లో దూది పెట్టుకోవడమా!"

"అదికాదు అది పని చేయడంలేదిప్పుడు! – వరంగల్ రోడ్డులో ఉప్పల్‌కి అవతల, ఊరికి సంబంధం లేకుండా మా ఫ్రెండొకడు ఉంటున్నాడు – ఈ వారం రోజులూ వాడింటికెళ్తున్నాను–"

"అంతేగాని – ఆమైకులను ఆపే ప్రయత్నం చేయరన్న మాట!"

"వృధా ప్రయాస – అదీగాక గుండాలతో – వ్యవహారం మనకెందుకు చెప్పండి."

గోపాల్రావ్ మళ్ళీ ఇంట్లో కొచ్చాడు.

అందరూ – ఎవరికి వారు – ఏదోకరకంగా సర్దుకు పోయేవారే!

మళ్ళీ రెండు క్షణాల నిశ్శబ్దం –

వెనుక వేపు వాటాలో ఉన్న విఠల్ రావు హడావుడిగా వచ్చాడు గోపాల్రావ్ దగ్గరకు.

"నీయవ్వ – ఫాల్తూ నా కొడుకులు – మనం ఆ మోతకి బతకాల్నా – సావాల్నా? పసి పిల్లలు ఒకటే ఏడుపు–" గోపాల్రావ్‌తో అన్నాడతను.

గోపాల్రావ్‌కి ఆనందం కలిగింది.

తనలాగా బాధపడుతున్నా వాడు ఒక్కడేనా దొరికాడు.

"నేనూ అదే మొత్తుకుంటున్నాను. మనిద్దరికీ తప్పితే ఇంకెవరికీ పట్టినట్టు లేదు" అన్నాడు గోపాల్రావ్–

"నువ్వు నాస్తాగట్టా చేసి తయారుండు – నేనూ నాస్తా చేసొస్తా – నీయవ్వ ఈమైక్ కిరికిరి ఎట్ల ఖతం కాదో సూస్తా!"

"ఓ నేను అరగంటలో రడీ అయిపోతాను–"

ఆనందంగా అన్నాడు గోపాల్రావ్

ఇద్దరూ ఏడు గంటల కల్లా బయల్దేరి ఎదురింట్లో ఉన్న యాదగిరిని పిల్చారు.

"ఏమిటి సంగతి!" అడిగాడు యాదగిరి.

"అదేం – ఆ మైక్ కిరికిరి బంద్ చేయనికి! – నడు" అన్నాడు విఠల్‌రావు.

అలా వూరుకుంటే ఈ తొమ్మిది రోజులో ఆ రెండు మైక్‌లూ కలిపి మనల్ని శవాలు చేసేస్తయ్" – గోపాల్రావ్ అందుకున్నాడు "కానీ ఆ పాటలు మంచిగా ఇనొచ్చుకదా" ఆనందంగా అన్నాడు యాదగిరి.

"అంత మోతపెడుతూంటే ఆ పాటలు ఎంజాయ్ చేస్తావా?" ఆశ్చర్యంగా అన్నాడు విఠల్‌రావు.

"ఎంతమోతగున్న సరే – నాకు పాటలంటే చాల ఇష్టం భాయ్ – రేడియోలో రోజుకి రెండు పాటలయినా నా పేరు మీద ప్రసారం జేస్తుంటరు ఇనలేదా మీరు?"

గోపాల్రావ్, విఠల్‌రావు మొఖాలు చూచుకున్నారు – తిరిగి అన్నాడతను "అన్నిట్లోకి సామజవరగమానా" భలే ఇష్టం!

సరిగ్గా అప్పుడే మళ్ళీ రెండు మైకుల్లో పాటలు తగులు కున్నాయ్.

సామజ – వరగమనా – సామజ – వరగమనా దూరాన దూరాన తారా దీపం – సాధుహృత్తార సాధ్య కాలాతీత విఖ్యాత – భారమయిని గుండెలో ఆరనితాపం – సామజవరగమనా – ఆరిపోదు చేరరాదు ఆశాదీపం – సామని గమజ సుధామయ – ఆ తారా దీపం ఈ తీరని తాపం – గానవిచక్షణ గుణశీల – వికసించిన మందారం నీ వయ్యారం – దయాల వాల మా పాలయ – సామజవరగమనా – విరియని పసి కందు మొగ్గ – నీ హృదయం – మనసులోన మధురమయిన – ఆమని కోయిల ఇలా నా జీవనవేణువు లూదగా – మరీ మరీ తిరిగేను మతిమాలిన తుమ్మెదను – మధుర లాలసల – దూరాస దూరాన – మధుపలాలసల – తారాదీపం – పెదవిలోని మధువు దూరాన – వెతముపూని – తారాదీపం – జతకు చేరుగా – నిసా – గని–మగా–గమ–

విఠల్‌రావ్ కోపంగా యాదగిరి వేపు చూచాడు.

ఇను – నీకిష్టమన్నావుగా – మనసారా ఇను – పధహా–" అంటూ గోపాల్రావ్ చేయి పట్టుకుని బయటికీడ్చుకొచ్చాడు.

ఇద్దరూ పందిట్లోని మైక్ సిస్టం దగ్గర కెళ్ళారు.

"ఇగో – ఈ మైక్ సౌండ్ తగ్గిస్తారా లేదా?" కోపంగా కుర్రాళనడిగాడు.

వాళ్ళు అతనివంక నిర్లక్ష్యంగా చూశారు.

"కమిటీ వాళ్ళనడగాలి. వాళ్లు తగ్గించమంటే తగ్గిస్తాం"

"ఎవరు కమిటీవాళ్ళు?"

"రాములుదాదా – లింగన్న గౌడ్ దాదా, రెడ్డిసాబ్–"

"సరే – వాళ్లనే అడుగుదాం పద–" అన్నాడు గోపాల్రావ్.

ఇద్దరూ రాములు దాదా ఇంటికి చేరుకున్నారు.

"రాములున్నాడా!" ఇంటి ముందు కూర్చున్న ఓ ముసలతన్ని అడిగాడు గోపాల్రావ్.

"ఎవళ్ళు మీరు!"

"మేము ఆ పక్క ఇళ్ళల్లోనే ఉంటాం!"

"ఏటి పని ఆడితో?"

"మాట్లాడాలి!" అన్నాడు విఠల్‌రావు.

"మాట్లాడాల్నంటే మధ్యాహ్నం పన్నెండుగంటలకు రాండ్రి!"

"ఇప్పుడింట్లో లేడా?"

"ఉన్నడు గానీ పదకొండు గంటలగ్గాని లేవడు–"

చేసేది లేక ఇద్దరూ ఇంటికి తిరిగి వచ్చారు.

ఈ సారి రెండు హిందీ రికార్డులు కల బడ్డాయి.

"కభి అల్విదనా కహెనా – ఓ – ఆజ్ హమారీ టక్కర్ హై – కభి అల్విద నా కహెనా–"

"పన్నెండింటికి వస్తాను – తయారుండు" అని చెప్పి వెళ్ళిపోయాడు విఠల్‌రావ్.

మధ్యాహ్నం పన్నెండింటికి ఇద్దరూ రాములింటికి కెళ్ళారు మళ్ళీ.

"గిప్పుడే వినాయకుడి పూజ గురించి పోయిండు –" అన్నాడు ముసలాడు.

ఇద్దరూ రికార్డులు మోగే చోటకు చేరుకున్నారు.

"రాములు వచ్చిండా ఈడకి!" ఓ యువకుడినడిగాడు విఠల్‌రావ్.

"వచ్చిండు – అగో – ఆ బార్ లో ఉన్నాడు –"

"బార్ లోనా?"

"అవ్!"

"ఆడెందుకున్నాడు–"

అతను నవ్వాడు – "బార్ల ఎందుకుంటరో – ఎరిక లేదా!"

ఇద్దరూ బార్‌లోనికి నడిచారు.

ఎదురుగ్గానే ముగ్గురు వ్యక్తులు కూర్చుని రమ్ తాగుతున్నారు.

"వినాయకుడి ఉత్సవ కమిటీ మెంబర్లు మీరేనా? అడిగాడు విఠల్‌రావ్.

"నెవ్వెవళు?"

"మేమిద్దరం – ఈ పక్కళ్ళలోనే ఉంటం!"

"ఏంగావాల్నీకు?"

"మా ఇద్దరి ఇళ్ళల్లోనూ ఆ మైక్ మోతకు బేజారయి పోతున్నాం – వాటి డైరెక్షన్ అయినా మార్చండి – లేదా జర సౌండ్ అయినా తగ్గించండ్రి!"

"మీ ఇద్దరూ హిందువు లేనా?" అడిగాడతను రమ్ గ్లాస్ ఎత్తి తాగి.

"అవ్– ఏమట్ల అడిగినవ్!"

"హిందువు లయ్యుండి – లొల్లి పెడతారువయ్యా – మన దేవుడివండగ్గాదిది?"

"మన పండగే గాని – దేవుడి మొఖాన్న స్పీకర్లు పడేసి – మనం బార్లలో కూసుంటే అవతలోళ్ళకి ఎంత తక్‌లీఫ్ ఉంటది!" కోపంగా అన్నాడు విఠల్‌రావ్.

"ఇగో – ఎక్కువ తక్కువ మాట్లాడకండ్రి – ఆ సౌండ్ గట్టనే ఉంటది – ఏం జేస్కుంటరో చేస్కోండి –" పొగరుగా అన్నాడతను.

విఠల్‌రావ్ ఏదో అనబోయాడుగానీ గోపాల్రావ్ అతని చేయి పట్టుకుని బయటకు లాక్కొచ్చాడు.

"వాడితో కిరికిరి ఎందుకు మనకి? ఎక్కువ మాట్లాడితే మనిద్దరినీ ఆ ముగ్గురూ కలిసి ఉతికేస్తారు " – అన్నాడు అతనిని సమాధాన పరుస్తూ.

"అట్లా అని ఈ దరిద్రం తొమ్మిది రోజులెట్లనయ్యా భరించేది?"

"పోలీస్‌కి రిపోర్టిద్దాం పద – దెబ్బకు దారికొస్తారందరూ!"

"ఆవ్ – మర్చిపోయినా – పద వెళ్దాం–"

ఇద్దరూ సైకిల్ మీద పోలీస్ స్టేషన్‌కి వెళ్ళారు.

"ఇన్‌స్పెక్టరు గారున్నారా?" హెడ్ కానిస్టేబుల్ నడిగాడు గోపాల్రావ్ –

"మీరెవరు?"

"మేము – అదిగో – ఆ మైక్ల దగ్గర ఇళ్ళల్లోనే ఉంటాం –"

"ఏం గావాలి మీకు!"

"కంప్లెయింట్ చేయాలి–"

"ఏ విషయం గురించి!"

"ఆ మైక్‌ల గురించి!"

"ఏ మైక్‌లు!"

"అదిగో – ఆ వీధి చివర వినాయకుడి పూజకు మైక్‌లు పెట్టలేదూ – అవి!"

"ఏం జరిగింది?"

"ఆ రెండు మైక్‌ల వల్ల – మా చుట్టుపక్క వాళ్ళందరికీ చాలా న్యూసెన్స్‌గా వుంది. పిల్లలు నిద్రపోవటం లేదు – మాకు పిచ్చెక్కి పోతోంది ఆ సౌండ్‌తో–"

"దానికి మేమేం జేయాల?"

"ఆ మైక్‌లు తీసేయమని చెప్పాలి!"

అన్నాడు విఠల్‌రావు.

"మే మెట్ల చెప్తామయ్యా – పర్మిషన్ మేమేగా ఇచ్చింది!"

"పక్కిళ్ళవాళ్ళకి ఇబ్బంది కలుగుతుందేమో చూడకుండా ఎట్లా ఇచ్చారు!"

"దేవుడు పూజకు ఇబ్బందేమిటయ్యా ఇంతవరకూ ఎవ్వరూ లొల్లి పెట్టలే–"

"ఇప్పుడు మేము పెడుతున్నాం కదా – ముందు అవి తీయించేయండి–"

"ఇప్పుడెట్ల తీస్తామయ్యా – కావాల్నంటే ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడండి లోపలకు పోండ్రి."

గోపాల్రావు – విఠల్‌రావు లోపల కెళ్ళారు.

ఇన్‌స్పెక్టర్ ఎవరితో ఫోన్లో మాట్లాడుతున్నాడు.

"ఆ – యస్సార్ – నేను సినిమాహాల్ దగ్గరే ఉంటాను తమరి కోసం – ఎన్ని సీట్లు రిజర్ చేయమంటారు సార్? ఎనిమిదా? ఓకేసార్ – అయ్ విల్ ఎరేంజ్ ఇట్–"

అంటూ ఫోన్ పెట్టేసి వాళ్ళవంక ఎగా దిఆ చూశాడు.

"ఏం కావాలి?"

"ఈ వీధి చివర రెండు మైక్‌లు పెట్టి తెల్లారు జామున మూడు గంటల నుంచీ సినిమా రికార్డులతో మా ప్రాణం తీస్తున్నారండీ! ఇంట్లో చాలా గొడవగా ఉంది. ఎవరికీ నిద్రలేదు–"

"అయితే నన్నేం చేయమంటారు?"

"అవి పూర్తిగా ఆపించేయండి – లేదా – సౌండ్ పూర్తిగా తగ్గించమనండి–"

"ఆపటం ఎట్లాకుదురుస్తుంది – మీలొకాలిటీ వాళ్ళందరూ కలిసే కదా చందాలిచ్చి పూజలు చేయిస్తోంది – మధ్యలో మేము వచ్చి మైక్ తీసేయమని చెప్పాలా? ఈజ్‌దేర్ ఎనీ సెన్స్?"

గోపాల్రావ్, విఠల్‌రావు మొఖాలు చూచుకున్నారు.

"ఇప్పటి సంగతేమోగానీ, ఇంకొక్క రోజు మీరు కల్పించుకోక పోతే ఆ సౌండ్స్‌తో మాకు పిచ్చెక్కటం ఖాయం –" అన్నాడు గోపాల్రావు–

"అయ్ కాన్ట్ హెల్పిట్–" అన్నాడు ఇనిస్పెక్టర్ లేచి నిలబడుతూ.

"అలా అనకండి ఇన్‌స్పెక్టర్ గారూ – మీ ఇంటి కిటికీ మైక్ పెడితే మీరు ఏం చేస్తారు.

"నా యింటి దగ్గర మైక్ పెట్టే ధైర్యం ఏవడికుంటుంది? సరే – కానిస్టేబుల్‌ని పంపిస్తాలే ఇంక వెళ్ళండి." అనేసి బయటికి వెళ్ళిపోయాడతను.

ఇద్దరూ బయటి కొచ్చారు.

"ఇప్పుడేమిటి చేయడం!" అన్నాడు గోపాల్రావు.

"కానిస్టేబుల్‌ని పంపించినా ఏమీ లాభం ఉండదని నా అభిప్రాయం."

"అవ్!"

"మరేమిటి చేద్దాం!"

"ఇంకేం చేస్తాం ఏం జరుగుతందో చూద్దాం – కానిస్టేబుల్ వచ్చేవరకూ వెయిట్ చేద్దాం!"

వాళ్ళు మళ్ళీ ఇంటికి చేరుకున్నారు.

సాయంత్రం కానిస్టేబుల్ వచ్చాడు పందిట్లోకి.

అతను రావడం. అక్కడి దాదాలతో మాట్లాడడం కనబడుతునే ఉంది.

తరువాత అందరూ కలసి పక్క సందులోనుంచి ఎక్కడికో వెళ్ళారు. అంతే !

కానిస్టేబుల్ మళ్లీ కనిపించలేదు.

ఇలా లాభం లేదని అందరం కలసి ఎమ్మెల్యేని కలుసుకోవాలనుకున్నాం – వెంటనే ఆయనింటికి చేరుకున్నాం!

అప్పుడే ఎక్కడికో బయల్దేరుతున్న వాడల్లా వాళ్లని చూచి ఆగాడాయన.

"నమస్కారం సార్!"

"నమస్తే – నమస్తే – నమస్తే – ఎవరు మీరు?"

"మేము ఈ ఏరియాలోనే వుంటున్నామండీ! మిమ్మల్ని సహాయం కోరదామని...."

"ఏమిటది!"

"మా ఇళ్ల పక్కకి రెండు వేపులా రెండు విఘ్నేశ్వరుళ్ళను పెట్టి పూజలు చేస్తున్నారు కదండీ! వాటి తాలూకా మైక్‌లు రాత్రింబగళ్లు – మా చెవులు బద్దలు కొట్టేస్తున్నాయండీ!"

"అయితే చెవి డాక్టరు దగ్గర కెళ్ళాలి వయ్యా! నేనేం చేస్తాను!"

"జర ఇనండి సార్! ఈ ఫాల్తూ రికార్డుల శబ్దానికి మా ఫాదర్ బ్లడ్ ప్రెజర్ ఎక్కువయి పోయింది. ఇంతకు ముందే హాస్పిటల్లో చేర్చాల్సి వచ్చింది–"

"మరి ఇంకేం కావాలయ్యా! ముసలాయనకు ఈ తొమ్మిద్దినాలూ దవాఖానలోనే ఉండనీ! కావాల్నంటే డాక్టర్‌కి నేను ఫోన్జేసి చెప్తాను. డిశ్చార్జ్ – గట్టా ఇయ్యద్దని!"

"అయితే మరి మాగతేమిటి సార్!"

"ఎట్లాగట్లా భరాయించాలయ్యా! ఆ పూజలు చేస్తున్నది యెవరికోసం! మన నియోజక వర్గంలోని ఓటర్లు సుఖంగా ఉండాలనేగదా!"

"ఎవరింట్లో వాళ్ళు పూజలు చేసుకుంటున్నాం కద్సార్ – మళ్ళీ దేవుడిని వీధిలోకి లాగటం"

"దేన్దారిదానిదే! ఇంట్లో దేవుడున్నాడని గుడికెళ్ళటం మాన్తన్నామా? అయినా – ఇట్లాంటి పండగలు – పబ్బాలూ మన పార్టీ వర్కర్లు ఖుషామత్ చేసుకోడానికేగా – ఇవన్నీ ఏర్పాటు చేసేది. యెలచన్లెప్పుడో అయిదేళ్ళ కోసారి వస్తయ్. అయిదేళ్ళ వరకూ ఆళ్ళెట్లా బతుకుతారు? ఏదో ఇలాంటి సందర్భాలొచ్చినప్పుడు చందాలు వసూలు చేసుకొని కొంత ఖర్చేసి కొంత మిగుల్చుకుని నడిపిస్తుంటారు. అవన్నీ మనం చూసీ చూడనట్లు పోవాలెగానీ, ఆ మైక్‌లు తీసెయ్. ఆషామ్యానాలు రోడ్డు కడ్డంగ ఎందుకట్టిన్రు? అంటూ కిరికిరి పెడితే – వచ్చే ఏలచన్ల నాతరుపున పని చెయ్యానికి వాండ్లు కిరికిరి పెడతరు – అర్థమయిందా? అంచేత ఈ నాల్గు దినాలూ కండ్లు మూసుకోండి వెళ్ళండ్రి – వెళ్ళండ్రి" సరిగ్గా అప్పుడే రాములు దాదా మరో ఇద్దరు వ్యక్తులతో వచ్చి యెమ్మెల్యేగారికి వినయంగా నమస్కరించాడు.

"ఏం రాములూ! ఏట్ల నడుస్తున్నది!"

"మంచిగ జమాయించింది సార్! సాయంత్రం ఏడు గంగల కల్లా తమరు వస్తే మంచి గుంటది–"

"బరాబరొస్తాలే! ఏంఫికర్ చేయకు"

"మంచిదిసార్–"

ఎమ్మెల్యేగారు కార్లో వెళ్ళిపోయారు

"ఏమివయ్యా మళ్ళీ ఈడకొచ్చిన్రు? గా మైక్ గురించేనా?" అడిగాడు రాము కోపంగా.

"అవును!" అన్నాడు విఠల్‌రావు.

"ఆర్నీయవ్వ – మీకు దేవుడి మీద బక్తి లేదా ఏంది?"

"ఆ చెత్త రికార్డులు పెట్టటమే భక్తి అయితే – లేదు"

"ఇదిగో – మీకు మంచిగా చెప్తున్నా, ఇంకోక్కసారి మైక్ గురించి యెవరికయినా కంప్లెయింట్ చేసిన్రా మంచిగుండదు! పోలీసాళ్లెం చేస్తారువయ్యా! మైక్‌లు గుంజుకు పోతారా? ఆళ్ల కంత దమ్ములున్నాయ్ ఇగో – ఈ ఇనిస్పెక్టర్ కాదు – కమీషనరు అయిన గానీ ఏమీ చెయ్యలేరు సమజైనాది? ఎమ్మెల్యేకి యెదురు మాట్లాడానికి యెవరికయా ధైర్యం ఉన్నాది!"

వాళ్ళువెళ్ళి పోయారు.

"ఇప్పుడేం చేద్దాం!" అడిగాడు గోపాల్రావ్.

"మినిష్టరుగారి దగ్గర కెళ్దాం! ఏమయినా సరే దీని అంతు తేల్చుకోవాలి...."

అన్నాడు విఠల్‌రావు.

ఇద్దరూ మినిష్టర్ గారింటికి చేరుకున్నారు.

బయట ఓ వ్యక్తి కూర్చుని ఉన్నాడు.

"ఎవరు మీరు! ఏం కావాలి!"

"మినిష్టర్ గారితో మాట్లాడాలి."

"ఏ విషయం?"

'ఆయనతోనే చెప్తాం!"

"ఆయనతో మాట్లాడాలంటే వారం రోజులు ముందే అపాయింట్ మెంట్ తీసుకోవాలి!" గత్యంతరం లేక వచ్చిన పని బయట పెట్టాడు గోపాల్రావ్.

"సంగతేమిటంటే – మా ఇళ్ళ దగ్గర జరుగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాల మైకులు చాలా న్యూసెన్స్‌గా ఉన్నాయ్. ఎవ్వరికీ నిద్రలేదు – రాత్రింబగళ్ళు మోత! ఎవరికి చెప్పినా – ఆఖరికి పోలీస్‌కి రిపోర్ట్ చేసినా ఫలితం దొరకడం లేదు–"

"అంటే మినిష్టరు గారిది ఇలా మైకుల గురించి ఫోన్లు చేసే ఉద్యోగం అనుకుంటున్నారా!"

"అహహ – అదికాదు"

"ఇదిగో చూడండి! మీకు తెలీదనుకుంటాను. ఇవాళ ఈ మినిష్టరుగారే ఎనిమిది

చోట్ల విఘ్నేశ్వర పూజకు హాజరవుతున్నారు. మరి ఆ మైకులు తీసేయమని వాళ్ళకు అయనెట్లా చెప్తారు?”

గోపాల్రావ్ తన తల రెండు చేతుల్తోనూ పట్టుకుని అక్కడే కూర్చుండిపోయాడు.

“అంటే – ఇక మా సావు మేము సావాల్సిందే నంటవ్!” కోపంగా అన్నాడు విఠల్‌రావు.

“అవునూ! అందులో కొత్తేముంది? ఎప్పటికయినా ఎవడి చావు వాడు చావ్వలసిందే” నవ్వుతూ అన్నాడా వ్యక్తి.

గోపాల్రావ్, విఠల్రావు అక్కడి నుంచి ఇంటివేపు బయల్దేరారు మళ్ళీ.

ఇల్లు దగ్గరవుతున్న కొద్దీ మైకులు రెండూ భీకరంగా శబ్దాలు చేస్తూ వినిపించసాగినాయి.

వందనం – అభివందనం – నాంపల్లి స్టేషన్ కాడి రాజాలింగా – నీ అందమే ఒక నందనం – రాజాలింగా–

రామారాజ్యం తీర్ సూడూ – శివాశంభులింగా – నన్నకు రేపుకు సంధిగ నిలిచిన ఓ సుందరీ – లింగా – రామారాజ్యం తీరూ సూడూ – పాదాభివందనం – శివాశంభులంగా – కన్నులు పొడిచిన చీకటిలో – తిందామంటే తిండీలేదు – రేదీపపు వెలుగుల్లో – ఉందామంటే ఇల్లేలేదు – తీరని ఊహల రేవుల్లో – చేద్దామంటే కొలువూ లేదు – తీరం చేరని పడవలో – పోదామంటే నెలవూలేదు – వస్తావనీ – నేనువస్తానని – గుక్కెడు గంజీ కరువైపోయే

ఒక్కడి పెళ్ళాం బరువైపోయే – తలపులు తలుపుకు తనువిచ్చీ – వలపుల గడలపకు గడుమిచ్చీ – బీదాబిక్కీ పొట్టలు కొట్టి మేడలు కట్టే చీకటి హట్టి – ఎదురు చూచిన సారికా – అభిసారికా – సారీ – వందనం నాంపల్లి స్టేషన్ కాడి రాజాలింగా వందనం –

గోపాల్రావు ఇంట్లో కొచ్చి పడుకున్నాడు. భోజన కూడా చేయబుద్ధి కావటంల లేదు. గుండెల మీద సమ్మెటపోట్లలా చెవుల్లో హోరెత్తిపోతూ, శబ్దాలు – రాత్రి తొమ్మిది – పది – పదకొండు – పన్నెడు – ఒంటి గంటా–

హె కృష్ణా – ముకుందా – మురారీ – ఇదిగో తెల్లచీరా – ఇవిగో మల్లెపూలు – రెండూ కావాలా? ఆ రెండూ కావాలా? వందనం – అభివందనం – నాంపల్లి స్టేషన్

కాదా – సామజవరగమనా – సామాజవరగమనా – ఇంటింటీ రామాయణం వింతయినా ప్రేమాయణం – దురాన దూరాన తారాదీపం – శంకరా – సూదిలో దారం – సందులో బేరం – సన్నాయి రాగానికి – ఈ చిన్నారి నాట్యానికీ – ఆడించు ఆడించు గానుగా – జనినీజన్మ భూమిశ్చ ఓసబ్బారావు – ఓ అప్పారావూ – సరిగమలు – లేపమంటావా, నన్నే లేపమంటావా – అంతవాడు అంతకు ఇంతై ఎంతో ఎదిగి పోయాడమ్మా – ఆగదు ఆగదు ఏ నిమిషము – ఆగితే సాగదు ఈ లోకము – పాలు కావాలా – పండుకావాలా?

గట్టిగా అరచి లేచికూర్చున్నాడు గోపాల్రావు–

రాజ్యలక్ష్మి అదిరిపడింది.

"ఏమిటండీ – ఏం జరిగింది!"

గోపాల్రావు మాట్లాడలేదు. పిచ్చి పట్టినవాడిలా భార్యవంక చూచాడు.

మర్నాడు ఉదయం నాలుగ్గంటలకు మళ్ళీ సినిమా పాటలు వేయడానికి విఘ్నేశ్వరుడి దగ్గరకు చేరుకున్న ఆ రెండు రోడ్ల ఉత్సవ కమిటీ మెంబర్లకూ – విఘ్నేశ్వర స్వామి బొమ్మలు కనిపించలేదు.